సిద్ధూ ముంగిటకు స్మగ్లింగ్ కేసు!

నటి రన్యారావుతో దిగిన ఫొటో షేర్ చేసిన బీజేపీ నేత మాలవీయ

బెంగళూరు, మార్చి 12: స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన నటి రన్యారావు కేసులో రాజకీయ నేతలెవ్వరికీ సంబంధాలు లేవంటూ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేసిన కొద్ది గంటలకే కీలక విషయం వెలుగులోకి వచ్చింది. నటి వివాహ వేడుకలో ఆమెతో కలిసి సీఎం సిద్ధరామయ్య దిగిన ఫొటో బయటపడింది. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఈ ఫొటోను సామాజిక మాధ్యమంలో బుధవారం షేర్ చేశారు. 'రన్యారావు స్మగ్లింగ్ కేసు ఇప్పుడు సీఎం సిద్ధరామయ్య ముంగిటకు చేరింది. ఈ ఫొటోలో హోం మంత్రి జీ పరమేశ్వరను కూడా మనం చూడవచ్చు' అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, స్మగ్లింగ్ కేసులో పట్టుబడ్డ కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయాన్ని ఆర్థిక నేరాలు విచారించే ప్రత్యేక కోర్టు రిజర్వ్‌లో ఉంచింది. ఈ కేసు తీవ్రత, రన్యారావుకు ఉన్న సంబంధం దృష్టిలో ఉంచుకుని ఆమెకు బెయిల్ మంజూరు చేయరాదని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) వాదించింది. సీనియర్ల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే తాను ఎయిర్‌పోర్టులో రన్యారావుకు రక్షణగా వెళ్లానంటూ అక్కడ ఆమెకు సహాయం చేసిన పోలీస్ అధికారి తమ విచారణలో వెల్లడించారన్నారు.

బంగారం ధర ఏ దేశాల్లో తక్కువంటే?

బెంగళూరు, మార్చి 12: కన్నడ నటి రన్యారావు దుబాయ్ నుంచి 14.2 కిలోల బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు ఎయిర్‌పోర్టులో పట్టుబడిన అనంతరం దుబాయ్ పసిడిపై మరోసారి చర్చ ప్రారంభమైంది. దుబాయ్‌లో బంగారం అంత చవకా? అని నెటిజన్లు ఆరా తీయడం ప్రారంభించారు. వాస్తవానికి బంగారం అతి తక్కువ ధరకు లభించే దేశాల్లో దుబాయ్ ఆరో స్థానంలో ఉంది. దుబాయ్ కన్నా చవకగా బంగారం లభించే దేశాలు దాని కన్నా ముందు ఐదు ఉన్నాయి. **అవేంటో పరిశీలిద్దాం**

విదేశాలలో పుత్తడి ధర చవకగా ఉంది కదా అని దానిని ఇష్టం వచ్చినట్టు పెద్ద మొత్తంలో మన దేశంలోకి తీసుకు రావడానికి నిబంధనలు అనుమతించవు. ఒక వేళ తెచ్చుకున్నా వాటిపై నిబంధనల మేరకు దిగుమతి సుంకం ఆరు నుంచి పది శాతం చెల్లించాలి.

బంగారం ధర తక్కువ ఉన్న దేశాలు (2025 ఫిబ్రవరి నాటికి)

దేశం	24 క్యారెట్ల బంగారం గ్రాము ధర	22 క్యారెట్ల బంగారం గ్రాము ధర
అమెరికా	రూ.8,586	రూ.7,874
ఆస్ట్రేలియా	రూ.8,602	రూ.7,889
సింగపూర్	రూ.8,667	రూ.7,949
స్విట్జర్లాండ్	రూ.8,682	రూ. 7,963
ఇండోనేషియా	రూ.8,704	రూ. 7,983
దుబాయ్	రూ.8,718	రూ. 7,996

హైజాకర్ల కాల్చివేత.. బంధీలు విడుదల

- రైలు హైజాక్ ఘటనలో ఆపరేషన్ ముగిసిందన్న పాక్
- 21 మంది ప్రయాణికులు, నలుగురు సైనికులు మృతి చెందినట్టు వెల్లడి
- 346 మంది బందీలకు విముక్తి కల్పించినట్టు ప్రకటన

హైజాకర్ల చెర నుంచి బందీలకు విముక్తి కల్పిస్తున్న పాక్ ఆర్మీ

క్వెట్టా: రైలును హైజాక్ చేసి వందల మంది ప్రయాణికులను బందీలుగా చేసుకున్న వేర్పాటువాద తీవ్రవాదులందరినీ చంపివేసినట్టు పాకిస్థాన్ సైన్యం బుధవారం ప్రకటించింది. సైనిక ఆపరేషన్ అనంతరం బందీలందరికీ విముక్తి కల్పించినట్లు తెలిపింది. తీవ్రవాదుల కాల్పులలో 21 మంది ప్రయాణికులు, నలుగురు పారామిలిటరీ సిబ్బంది మరణించారని సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. ఘటనా స్థలి వద్ద ఉన్న 33 మంది తీవ్రవాదులను భద్రతా దళాలు చంపివేశాయని, 346 మంది బందీలకు విముక్తి కల్పించినట్టు తెలిపారు.

20 గంటల డెడ్‌లైన్

అంతకుముందు పాక్ సర్కారుకు వేర్పాటువాద (గ్రూపు బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) అల్టిమేటం జారీచేసింది. తమపై పాకిస్థాన్ సైనిక దాడికి ప్రతీకారంగా 50 మంది బందీలను చంపివేసినట్టు ప్రకటించింది. సైనిక ఆపరేషన్‌ను నిలిపివేసి బలూచ్ ఖైదీలను విడుదల చేస్తున్నట్టు ప్రకటించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి మరో 20 గంటలు మాత్రమే గడువు ఉందని హెచ్చరించింది. పాకిస్థాన్ ప్రభుత్వం స్పందించని పక్షంలో తమ వద్ద బందీలుగా ఉన్న వారినందరినీ చంపివేస్తామని వేర్పాటువాదులు హెచ్చరించారు. మంగళవారం రాత్రి పాకిస్థాన్ జరిపిన డ్రోన్ దాడికి సమాధానంగా 10 మంది భద్రతా సిబ్బందిని చంపివేసినట్టు వేర్పాటువాదులు ప్రకటించారు. బుధవారం జరిగిన కాల్పుల పోరులో మరో 10 మంది సైనికులు మరణించారని, మొత్తంగా హైజాక్ జరిగినప్పటి నుంచి మొదలైన పోరులో 100 మందికి పైగా సైనిక సిబ్బంది మరణించారని వేర్పాటువాదులు తెలిపారు. తమ అధీనంలో 150 మందికి పైగా బందీలుగా ఉన్నారని బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో బీఎల్‌ఏ తెలిపింది.

ఆత్మాహుతి జాకెట్లతో ప్రయాణికుల పక్కనే..

9 బోగీలలో దాదాపు 500 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పేషావర్ వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను సాయుధ తీవ్రవాదులు మంగళవారం మధ్యాహ్నం బోలన్ ప్రాంతంలోని గుడాలర్, పీరు కున్రీ పర్వత శ్రేణుల సమీపాన రైల్వే ట్రాకు పేల్చివేసి సొరంగంలో నిలిపివేశారు. ప్రయాణికులను బందీలుగా చేసుకున్నారు. జైలులో ఉన్న తీవ్రవాదులను విడిచిపెట్టడానికి ప్రభుత్వం అంగీకరిస్తే బందీలను విడుదల చేయడానికి తమకు అభ్యంతరం లేదని అంతకుముందు బీఎల్‌ఏ ప్రతినిధి జీయాండ్ బలోచ్ తెలిపారు. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఆత్మాహుతి జాకెట్లు ధరించిన తీవ్రవాదులు తమ బందీలకు అత్యంత సమీపంలో కూర్చుని ఉన్నారని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఓటమి భయంతో ఉన్న తీవ్రవాదులు అమాయక ప్రయాణికులను మానవ కవచాలుగా అడ్డుపెట్టుకుని తప్పించుకోవాలని ప్రయత్నించే అవకాశం ఉందని,మూడు వేర్వేరు ప్రదేశాలలో మహిళలు, పిల్లలను వారు బందీలుగా చేసుకున్నారని చెప్పాయి.

అమెరికాపై ప్రతీకార సుంకాలు

- ప్రకటించిన ఈయూ, కెనడా
- ఉక్కు, అల్యూమినియంపై అమెరికా టారిఫ్‌లకు కౌంటర్

వాషింగ్టన్, మార్చి 12: ఉక్కు, అల్యూమినియానికి సంబంధించిన అన్ని ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో యూరోపియన్ యూనియన్(ఈయూ), కెనడా ప్రతీకార చర్యలు చేపట్టాయి. అమెరికాకు చెందిన 28 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై సుంకాలు విధించనున్నట్టు ఈయూ ప్రకటించింది. ఇప్పటివరకు అమెరికా వస్తువులపై ఉన్న టారిఫ్ సస్పెన్షన్‌ను ఏప్రిల్ 1 నుంచి ఎత్తివేస్తున్నట్టు యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ ప్రకటించారు. అమెరికా 28 బిలియన్ డాలర్ల విలువైన సుంకాలు విధించడానికి సిద్ధపడుతుండగా, తాము కూడా 26 బిలియన్ యూరోల (28 బిలియన్ డాలర్లు) విలువైన ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. 27 సభ్య దేశాల తరపున వాణిజ్య వ్యాపార ఘర్షణలను చక్కదిద్దే బాధ్యతను కమిషన్ నిర్వహిస్తోంది. తాము సంప్రదింపులకు ఎప్పుడూ సిద్ధమేనని ఆమె చెప్పారు. రాజకీయ, ఆర్థిక భౌగోళిక అస్థిర పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో సుంకాల భారాన్ని తమ దేశాలు ఆర్థికంగా మోయలేవని పేర్కొన్నారు. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులతోపాటు జౌళి, చర్మ వస్తువులు, గృహోపకరణాలు, ఇంటి పనిముట్లు, ప్లాస్టిక్, కలప వంటి వస్తువులతో పాటు పౌల్ట్రీ, బీఫ్, సీఫుడ్, నట్స్, గుడ్లు, చక్కెర, కూరగాయలు వంటి వ్యవసాయ పదార్థాల ధరలపై కూడా ప్రభావం ఉంటుందని కమిషనర్ చెప్పారు. తాను విధించే పన్నుల వల్ల అమెరికా ఫ్యాక్టరీలలో ఉపాధి కల్పన జరుగుతుందన్న ట్రంప్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ యూరపు, అమెరికాలో కూడా ఉద్యోగాలు పోవడంతోపాటు ధరల పెరుగుదల ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అమెరికా పన్నులతో వ్యాపారాలే కాక వినియోగదారులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు.

అమెరికాపై కెనడా సుంకాలు

తమ దేశానికి చెందిన ఉక్కు, అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా కెనడా కూడా అమెరికా వస్తువులపై రూ. 20.7 బిలియన్ డాలర్ల విలువైన సుంకాలను విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. గురువారం నుంచి అమలులోకి వచ్చే ఈ కొత్త సుంకాలు కంప్యూటర్లు, క్రీడా సామగ్రి వంటి వివిధ రకాల వస్తువులపై ఉంటాయి.

మా మద్యంపై భారత్ 150% సుంకం

అమెరికన్ మద్యం, వ్యవసాయ ఉత్పత్తులపై భారత ప్రభుత్వం భారీగా సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ ప్రభుత్వం విమర్శించింది. అమెరికన్ వస్తువులపై భారతీయ సుంకాలు ప్రస్తుత వాణిజ్య పరిస్థితికి ఏమాత్రం దోహదపడబోవని వైట్ హౌస్ పత్రికా కార్యదర్శి క్యాథరిన్ లీవిట్ అన్నారు. అమెరికన్ డెయిరీ ఉత్పత్తులపై కెనడా దాదాపు 300 శాతం సుంకాన్ని విధిస్తోందని, అమెరికన్ ఆల్కహాల్(మద్యం)పై భారత్ 150 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై 150 శాతం సుంకాన్ని విధిస్తోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో భారత్‌కు అమెరికా ఉత్పత్తులు ఎలా ఎగుమతి అవుతాయని ఆమె ప్రశ్నించారు.

బెంగళూరు 'చార్ జామ్ యాత్ర'

ట్రాఫిక్ జామ్‌లపై ఇన్ఫోసిస్ డైరెక్టర్ సెటైర్

బెంగళూరు: ఎడతెగని ట్రాఫిక్ జామ్‌లతో నిత్యం సతమతమయ్యే బెంగళూరు మరోసారి హెడ్‌లైన్లలో నిలిచింది. అయితే ఎప్పటిలా ఇక్కడ ఇన్ని గంటలు.. అక్కడ అన్ని గంటలు ట్రాఫిక్ జామ్ లాంటి రొటీన్ విషయాలతో కాదు. ఇన్ఫోసిస్ డైరెక్టర్ మోహన్ దాస్ పాయ్ బెంగళూరు నగర ట్రాఫిక్ జామ్‌పై సామాజిక మాధ్యమంలో సెటైర్ వేశారు. 'బెంగళూరు టూరిజం శాఖ 4 పగళ్లు, 3 రాత్రుళ్ల ఈ కింది ప్రదేశాలకు ట్రిప్ నిర్వహిస్తున్నది. అవి ఔటర్ రింగ్ రోడ్డు, సిల్క్ రోడ్ జంక్షన్, మరాతాహళ్లి, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లు. ఇవన్నీ తప్పక సందర్శించాల్సిన స్థలాలు. దీనిని చార్ జామ్ యాత్ర అంటారు' అని పేర్కొన్నారు. 'బెంగళూరుపై ఒక విచారకరమైన జోక్. మనల్ని, మన బాధలను గురించి పట్టించుకోని ప్రభుత్వం గురించి మనకు హాస్య చతురత ఉంది' అని పోస్ట్ చేశారు. ఓ నెటిజన్ స్పందిస్తూ, 'ట్రాఫిక్ జామ్‌ల కారణంగా యాత్రను నిర్వహించలేక పోతున్నాం' అని వ్యాఖ్యానించారు.

హర్యానా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సున్నా

10 స్థానాల్లో ఒక్కటీ గెలవని హస్తం పార్టీ

చండీగఢ్: హర్యానా స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాజయం ఎదురైంది. మొత్తం 10 మేయర్ స్థానాలకు ఎన్నికలు జరుగగా, తొమ్మిదింటిలో బీజేపీ విజయం సాధించింది. మరో స్థానాన్ని ఇండిపెండెంట్ అభ్యర్థి కైవశం చేసుకున్నారు. కాంగ్రెస్ ఖాతా కూడా తెరవ లేదు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం పొందడంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చూపాలనుకున్న కాంగ్రెస్ పార్టీకి పూర్తి నిరాశ ఎదురైంది. ముఖాముఖీ పోటీ జరిగినప్పటికీ గట్టి పోటీ కూడా ఇవ్వలేక పోయింది. కాంగ్రెస్ మాజీ సీఎం భూపేందర్ సింగ్ హూడాకు గట్టి పట్టున్న రోహతక్‌తో పాటు సోనిపట్‌లో సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయింది.

ఉచితాలతో పేదరికం పోదు

ఉద్యోగాల కల్పనతోనే అది సాధ్యం

ఇన్ఫోసిస్ నారాయణమూర్తి

ముంబై, మార్చి 12: ఉచితాల ద్వారా పేదరికం పోదని, అలా ప్రయత్నించిన దేశాలు విఫలమయ్యాయని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అన్నారు. దేశంలో ఉచితాల ద్వారా కాదు.. వినూత్న వ్యవస్థాపకులు సృష్టించే ఉద్యోగాలు పేదరికం తొలగింపునకు సహాయపడతాయనిఆయన తెలిపారు. టైకన్ ముంబై 2025 కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉచితాలు ఇచ్చిన ఏ దేశం కూడా విజయం సాధించ లేదు అని పేర్కొన్నారు.

ఉత్తరాదిలో సీట్లు పెంచుకునే వ్యూహం

బీజేపీపై స్టాలిన్ ఆరోపణ

చెన్నై: హిందీ భాషా వికాసానికి ఉద్దేశించిన కాషాయ విధానంగా జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ) తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అభివర్ణించారు. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ద్వారా ఉత్తరాది రాష్ట్రాలలో గెలుపొంది తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. బుధవారంనాడిక్కడ ఓ బహిరంగ సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ తమకు ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలలో ఎంపీ సీట్లను పెంచుకుని పార్టీని బలోపేతం చేసుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ప్రయత్నాలను డీఎంకే అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు. తమిళనాడు విద్యా ప్రగతిని పూర్తిగా నాశనం చేసే ఎన్ఈపీని తాము వ్యతిరేకిస్తామని అన్నారు.

భూగర్భంలో రెండు భారీ శిఖరాలు

- ఎవరెస్ట్ కన్నా వంద రెట్ల ఎత్తు
- శాస్త్రవేత్తలకు అంతుబట్టని రహస్యం

న్యూఢిల్లీ: ఎవరెస్ట్ శిఖరం కన్నా 100 రెట్లు ఎత్తయిన రెండు భారీ నిర్మాణాలు భూమి కింద ఉన్నాయి. అవి ఎలా ఏర్పడ్డాయి? అనే వివరాలు శాస్త్రవేత్తలకు అంతుబట్టడం లేదు. మేరీలాండ్ విశ్వవిద్యాలయం జియాలజిస్ట్ వేద్ లెకీ తెలిపిన వివరాల ప్రకారం, ఓ ఖండం అంత పెద్ద పరిమాణం గల ఈ శిలా రూపాలను బ్లాబ్స్ అంటారు. ఇవి తమ చుట్టూ ఉన్న ప్రాంతం కన్నా భిన్నమైనవి. వీటి గుండా ప్రయాణించే భూకంప తరంగాల వేగం తగ్గుతున్నట్లు గుర్తించారు. అందుకే వీటిని లార్జ్ లో షియర్ వెలాసిటీ ప్రావిన్సెస్ అని పిలుస్తున్నారు. ఇవి భూమిలోని ఇతర ప్రాంతాల కన్నా భిన్నమైనవని చెప్పడానికి ఇది సంకేతం. వీటి గురించి 1970వ దశకంలో తెలుసుకున్నప్పటికీ, మరిన్ని వివరాలను తెలుసుకోలేకపోతున్నారు. భూమి ఉపరితలం నుంచి వేలాది మైళ్ల కింద నుంచి ఇవి ప్రారంభమైనట్లు మాత్రం గుర్తించారు. ఇవి పసిఫిక్ మహాసముద్రం, ఆఫ్రికా ఖండం, అట్లాంటిక్‌ల కింద ఉన్నాయి. ఒకవేళ ఇవి భూమిపైకి వస్తే, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కక్ష్యను చేరుకోగలవు! భూమిపై జరిగే పరిణామాలపై వీటి ప్రభావం ఏమిటో కూడా తెలియదు.



వరదలు.. ఆ వెంటనే కరువు!

- ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు
- వేగంగా మారిపోతున్న వాతావరణం
- ప్రపంచ నీటి చక్రం ధ్వంసం
- ముంబై, లక్నో నగరాలకూ 'వాతావరణ గాయాలు'
- 'వాటర్ ఎయిడ్' అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 12: ప్రపంచంలో అధిక జనసాంద్రత కలిగిన కొన్ని నగరాల్లో వాతావరణం అస్థిరంగా ఉంటున్నదని, కరువుల నుంచి వరదలకు, ఆ వెంటనే మళ్లీ ఉష్ణోగ్రతలు పెరిగి కరువులకు మారుతోందని 'వాటర్ ఎయిడ్' అనే స్వచ్ఛంద సంస్థ వెల్లడించింది. దీంతో ప్రపంచ నీటి చక్రం (వాటర్ సైకిల్) ధ్వంసమవుతోందని బుధవారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో పేర్కొంది. నిరంతరం మారుతున్న అస్థిర వాతావరణ పరిస్థితులతో లక్నో, ముంబై లాంటి భారతీయ నగరాలు సతమతమవుతున్నట్టు స్పష్టం చేసింది. దక్షిణాసియా, ఆగ్నేయ ఆసియా ప్రాంతాలు తీవ్రమైన తేమ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, మధ్యప్రాచ్యంతో పాటు యూరప్, ఉత్తర ఆఫ్రికా ప్రాంతాలు నిరంతరం పొడిగా మారుతున్నాయని పరిశోధకులు తేల్చారు. ప్రపంచంలో అధిక జనాభా ఉన్న వందకుపైగా నగరాల నుంచి 42 ఏండ్ల వాతావరణ సమాచారాన్ని సేకరించి వారు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పులతో కొన్ని ప్రాంతాలకు లాభం, మరికొన్ని ప్రాంతాలకు నష్టం వాటిల్లుతోందని కార్డిఫ్ యూనివర్సిటీలోని వాటర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మైఖేల్ సింగర్ పేర్కొంటూ.. ఈ పరిస్థితిని 'ప్రపంచ వింత'గా అభివర్ణించారు. అస్థిర వాతావరణ పరిస్థితుల వల్ల అధికంగా సతమతమవుతున్న ప్రాంతాల జాబితాలో చైనా తూర్పు నగరమైన హాంగ్‌ఝూ, ఇండోనేషియా రాజధాని జకార్తా అగ్రస్థానంలో ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. సర్వే నిర్వహించిన ప్రాంతాల్లో 15% నగరాలు ఈ 2 రకాల అధ్వాన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ఒకేసారి వరదలు, కరువు బారినపడుతున్నాయని వెల్లడైంది. ఇలాంటి నగరాల జాబితాలో అమెరికాలోని డాలస్, షాంఘై, బాగ్దాద్ ముందు వరసలో ఉన్నట్టు 'వాటర్ ఎయిడ్' స్పష్టం చేసింది.

క్యూఎస్ టాప్-50లో ఐఐఎం అహ్మదాబాద్, బెంగళూరు

జాబితాలో 9 భారతీయ యూనివర్సిటీలకు చోటు

న్యూఢిల్లీ : ఈ ఏడాది వెలువడిన క్యూఎస్-ర్యాంకింగ్స్‌లో 9 భారతీయ విద్యా సంస్థలు తమ సత్తా చాటాయి. బిజినెస్, మేనేజ్‌మెంట్ విద్యలో ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం బెంగళూరు వరల్డ్ టాప్-50లో చోటు దక్కించుకున్నాయి. ఐఐఎం అహ్మదాబాద్ 27వ ర్యాంక్ (గత ఏడాది 22), ఐఐఎం బెంగళూరు 40వ ర్యాంక్ (గత ఏడాది 32) సాధించాయి. గతంతో పోల్చితే ఈ రెండు విద్యా సంస్థల ర్యాంకింగ్స్ పడిపోయాయి. ఇంజినీరింగ్-మినరల్, మైనింగ్ విభాగంలో ధన్‌బాద్‌లోని ఐఎస్ఎంకు 20వ ర్యాంకు, ఐఐటీ-బాంబేకు 28, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు 45వ ర్యాంకు దక్కింది.

- వేగంగా కరుగుతున్న మంచు
- వరుసగా మూడో నెల కనిష్ఠ స్థాయికి సముద్రపు మంచు
- ప్రపంచ ఉష్ణోగ్రతలపై ప్రభావం

ప్రమాదపుటంచున ఆర్కిటిక్!

న్యూయార్క్, మార్చి 12: ఆర్కిటిక్ మహా సముద్రం ఎకోసిస్టమ్‌లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్కిటిక్ ప్రాంతంలో 20 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఫిబ్రవరి చివరి నాటికి ఆర్కిటిక్ మంచు కనిష్ఠ స్థాయిలో నమోదైంది. ఇలా వరుసగా మూడోసారి జరగడం ఆందోళన కలిగిస్తున్నది.

2050 నాటికి మంచు రహిత వేసవి...

ప్రపంచ వాతావరణంలో, ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచడంలో ఆర్కిటిక్ కీలక పాత్ర పోషిస్తున్నది. దీన్ని భూగ్రహ ఎయిర్ కండిషనర్‌గా శాస్త్రవేత్తలు పిలుస్తుంటారు. భూతాపం పెరుగుదలకు ఆర్కిటిక్‌లో మంచు కరగడం ముందస్తు ప్రమాద సూచికగా భావించవచ్చు. సాధారణంగా ఈ సమయానికి ఆర్కిటిక్‌లో మంచు గరిష్ఠ స్థాయిలో నమోదవ్వాలి. కానీ, అందుకు విరుద్ధంగా ఇప్పుడు కనిష్ఠ స్థాయి నమోదవుతున్నాయి. ఆర్కిటిక్‌లో సెప్టెంబర్ చివరికి వేసవి ముగుస్తుంది. ఆ సమయంలో మంచు కరగడం సాధారణం. కానీ, ఇప్పుడు వేసవి ముగిసినా మంచు ఎక్కువగా కరిగి కనిష్ఠ స్థాయికి చేరుకుంటున్నది. ఇది ఇలాగే కొనసాగితే 2050 నాటికి మంచు రహితంగా ఆర్కిటిక్‌ను చూడాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- *ఈ ఫిబ్రవరిలో సముద్రపు మంచు 5.3 మిలియన్ చదరపు అడుగుల మైళ్లుగా నమోదైంది.*
- *1991-2020 మధ్యకాలంలో ఫిబ్రవరి నెల సగటుతో పోలిస్తే ఇది 8 శాతం తక్కువ.*
- *2024 డిసెంబర్ నుంచి ప్రతి నెల కనిష్ఠ స్థాయి నమోదవుతూ రికార్డు బద్దలవుతున్నాయి.*

మంచు కరిగితే జరిగే అనర్థాలు...

- *ఆర్కిటిక్ మంచు కరిగితే అక్కడి జీవవైవిధ్యం, 40 లక్షల మంది ప్రజలు, జంతుజాలంతో పాటు యావత్ ప్రపంచంపై దాని ప్రభావం పడుతుంది.*
- *ప్రపంచ సగటు కంటే నాలుగు రెట్లు వేగంతో ఆర్కిటిక్ మంచు కరుగుతున్నది.*
- *మహాసముద్రాల్లోని మంచు అద్దంలా పనిచేస్తుంది. తద్వారా భూమిపై ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి.*
- *అదే మంచు లేకపోతే భూమిపై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయి.*
- *మట్టి, రాళ్లు, ఇతర అవక్షేపాల మిశ్రమమైన మంచు కరిగితే కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ వాయువులు విడుదల అవుతాయి.*
- *సముద్రమట్టాలు పెరిగి నగరాలు కనుమరుగవుతాయి.*

ఎందుకు కరుగుతున్నట్టు..

- *గ్రీన్‌ల్యాండ్‌లోని ఐస్ ఏటా 280 బిలియన్ టన్నుల చొప్పున కరుగుతున్నది.*
- *ఆర్కిటిక్ సమీప ప్రాంతాల్లో గత ఐదేండ్లుగా కార్చిచ్చులు ఎక్కువవుతున్నాయి.*
- *ఫ్రాన్స్ ఒప్పందాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ట్రంప్.. అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత వాతావరణ విభాగాన్ని నిర్వీర్యం చేశారు. అందులో పనిచేసే చాలామంది ఉద్యోగులకు ఉద్వాసన పలికారు.*

కృత్రిమ గుండెతో 100 రోజులు

కాన్‌బెర్రా: హార్ట్ ఫెయిల్యూర్ అయిన ఓ ఆస్ట్రేలియన్‌కు కృత్రిమ గుండెను అమర్చగా... అతడు దాంతో 100 రోజులు జీవించాడని, ఇది ప్రపంచంలో తొలిసారి అని సిడ్నీ వైద్యులు బుధవారం ప్రకటించారు. సదరు వ్యక్తి కృత్రిమ గుండెతో 100 రోజులు జీవించిన తర్వాత, దాత లభించటంతో.. వైద్యులు జరిపిన ఇంప్లాంట్ విజయవంతమైందని తెలిపారు. దీంతో అతడు పూర్తి ఆరోగ్యంతో దవాఖాన నుంచి బయటకు వచ్చాడని చెప్పారు. దాత దొరకటంతో ఇంప్లాంట్ జరిపామని సిడ్నీ వైద్యులు తెలిపారు.

ఒక్కో రక్తపు చుక్కకు 3 వేల చార్జి

మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానని రిటైర్డ్ టీచర్‌కు టోకరా

జబల్పూర్: మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానంటూ రిటైర్డ్ టీచర్‌ను బురిడీ కొట్టించిన ఇద్దరు అతని నుంచి రూ.లక్ష కాజేసిన ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో జరిగింది. కేఎల్ సోనీ (78) కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. మందులు కొనుగోలు చేసి వస్తున్న సోనీని ఒక యువకుడు పలుకరించాడు. తన తల్లి కూడా మోకాళ్ల నొప్పులతో బాధపడేదని, ఆర్కే పటేల్ అనే డాక్టర్ నయం చేశాడని చెప్పి, అతని చిరునామాను తెలుసుకున్నాడు. కొన్ని రోజులకు డాక్టర్ పటేల్ పేరుతో ఒక వ్యక్తి ఆ వృద్ధుడి ఇంటికి వచ్చి పరీక్షలు చేసి, అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, ఆలస్యమైతే కాళ్లు తీసేయాల్సి ఉంటుందని హెచ్చరించాడు. దానికి తాను చికిత్స చేస్తానని నమ్మించి ఒక పరికరంతో కొంత రక్తం తీశాడు. ప్రతి రక్తపు చుక్కకు రూ.3వేల చొప్పున రూ.6.5 లక్షలు బిల్లు అయినట్టు చెప్పాడు. దీంతో బెంబేలెత్తిన సోనీ తన వద్ద అంత డబ్బు లేదని చెప్పి అతనికి రూ.లక్ష ఇచ్చాడు. ఆ సొమ్ము తీసుకుని కొన్ని మందులు రాసిచ్చిన ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ మందులు కొనడానికి వెళ్లగా రూ.75 వేలని చెప్పడంతో కొనకుండానే ఇంటికి వస్తుండగా, మరో వ్యక్తి ఎదురై గతంలోలానే ప్రశ్నించి.. డాక్టర్ పటేల్ నయం చేస్తారని చెప్పడంతో మోసపోయినట్టు గ్రహించిన వృద్ధుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాంతి ఘనీభవనం!

- తొలిసారి సూపర్‌సాలిడ్‌లా మార్పు
- ఇటలీ శాస్త్రవేత్తల అద్భు త ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ద్రవ పదార్థం (లిక్విడ్) ఘన పదార్థం (సాలిడ్)గా మారడాన్నే ఘనీభవన ప్రక్రియ అంటారని మనందరికీ తెలుసు. కానీ, నమ్మశక్యంకాని రీతిలో ఇటలీ శాస్త్రవేత్తల బృందం ఏకంగా కాంతినే ఘనీభవింపజేయగలిగింది. నానో టెక్నాలజిస్టులు, భౌతిక శాస్త్రవేత్తలతో కూడిన ఈ బృందం తొలిసారి కాంతిని 'సూపర్‌సాలిడ్'లా ప్రవర్తించేలా చేయగలిగింది. తద్వారా ఇప్పటివరకు మనకు తెలిసిన సైన్సును మార్చేసింది. ఈ నూతన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు 'ఏ సూపర్‌సాలిడ్ మేడ్ యూజింగ్ ఫోటాన్స్' పేరిట ఈ నెల 5న 'నేచర్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. ఏదైనా ద్రవం ఉష్ణోగ్రతను దాని ఘనీభవన స్థానానికి తగ్గించినప్పుడు సాధారణ ఘనీభవనం జరుగుతుంది. ఆ ప్రక్రియలో ఆ ద్రవం అణువులు నెమ్మదించి స్ఫటికాకార నిర్మాణంగా కలిసిపోతాయి. ఇదే మనకు తెలిసిన భౌతికశాస్త్ర సూత్రం. కానీ, పదార్థంలోని అణువుల ఉష్ణోగ్రతలు పూర్తిగా 'సున్నా' స్థాయికి (మైనస్ 273.15 సెంటీగ్రేడ్) తగ్గినప్పుడు వాటి క్వాంటమ్ యాంత్రిక స్వభావం బయటపడుతుందని, పదార్థపు అసాధారణ దశలు కనిపిస్తాయని వారు వివరించారు. గతంలో అతిశీతల అణువులను ఘనీభవింపజేయడం ద్వారా మాత్రమే సూపర్‌సాలిడ్స్‌ను సృష్టించగలిగారు. కాంతి కిరణాల్లో (ఫోటాన్స్‌లో) సూపర్‌సాలిడ్ స్థితిని గుర్తించడం ద్వారా దాని రహస్యాలను ఛేదించేందుకు కొత్త ద్వారాన్ని తెరిచారు. సూపర్‌సాలిడిటీ గురించి తెలుసుకునే దిశగా ఇది కేవలం తొలి అడుగు మాత్రమేనని ఇటలీలోని సీఎన్ఆర్ నానోటెక్, పావియా యూనివర్సిటీకి చెందిన భౌతిక శాస్త్రవేత్తలు ఆంటోనియో జియాన్‌ఫేట్, డేవిడ్ నీగ్రో తెలిపినట్టు 'న్యూస్‌వీక్' పత్రిక పేర్కొంది.



3 రెట్లు పెరిగిన డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు

2024లో రూ.1,935 కోట్లు దోపిడీ: కేంద్రం

న్యూఢిల్లీ: మనదేశంలో 2022-24 మధ్యకాలంలో డిజిటల్ అరెస్టు స్కామ్‌లు, సంబంధిత సైబర్ నేరాల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని కేంద్రం తెలిపింది. గత ఏడాది సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్ము 21 రెట్లు పెరిగి.. రూ.1,935 కోట్లకు చేరుకుందని కేంద్రం తాజాగా గణాంకాలు విడుదల చేసింది. బుధవారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్రం ఈ వివరాలు వెల్లడించింది. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ప్రకారం, ఒక్క 2022 ఏడాదిలో 39,925 కేసులు నమోదుకాగా, రూ.91.14 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. 2024నాటికి కేసుల సంఖ్య 1,23,672కు చేరుకుంది.